క్లుప్తంగా

భీమేశ్వరుని దర్శించుకున్న కలెక్టర్ దంపతులు



ద్రాక్షారామ భీమేశ్వరుని సన్నిధిలో జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, నివేదిత దంపతులు

రామచంద్రపురం రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల, డాక్టర్ నివేదిత దంపతులు కార్తిక సోమవారం పురస్కరించుకుని ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని ఆధ్వర్యంలో అర్చకులు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. భీమేశ్వరస్వామిని, మాణిక్యాంబా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం బేడా మండపంలో వేద పండితుల వేదాశీర్వచనం అందుకున్నారు. వారి వెంట రామచంద్రపురం ఆర్డీఓ దేవరకొండ అఖిల, కొత్తపేట ఆర్డీఓ శ్రీకర్ దంపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

గొల్లపుంత కాలనీలో నేడు ఎన్‌పీసీఐ లింకేజీ ప్రోగ్రాం

మండపేట: మండపేట పోస్టల్‌శాఖ ఆధ్వర్యంలో ఎన్‌పీసీఐ లింకేజ్ కార్యక్రమాన్ని మంగళవారం 21వ వార్డు గొల్లపుంత కాలనీలోని మెప్మా భవనంలో ఏర్పాటు చేసినట్టు పోస్టల్ అసిస్టెంట్ కొండపల్లి సూర్యనారాయణ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వుల మేరకు సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాను పోస్టల్‌శాఖకు కూడా అనుసంధానం చేశారన్నారు. తపాలా కార్యాలయంలో ఐపీపీబీ అకౌంట్ ఓపెన్ చేసిన తర్వాత దానికి ఎన్‌పీసీఐ లింకేజి చేస్తారన్నారు. ఆధార్‌కార్డు జిరాక్స్, కేవలం రెండు వందల రూపాయలతో రెండే నిమిషాల్లో ఖాతాను తెరచి వెంటనే ఎన్‌పీసీఐ లింక్ అనుసంధానం చేస్తామన్నారు. ఉదయం 10 గంటల నుంచి పోస్టల్ సిబ్బంది కాలనీలో అందుబాటులో ఉంటారని తెలిపారు చేశారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, రైతుభరసా, గ్యాస్ సబ్సిడీ వరకూ ఇలా అన్ని పథకాల లబ్ధిని డీబీటీ ద్వారా పోస్టల్ అకౌంటు ద్వారా సులువుగా పొందవచ్చన్నారు. మరిన్ని వివరాల కోసం 9989798094 నంబరుకు సంప్రదించవచ్చన్నారు.

నేటి నుంచి ఆధార్ నవీకరణ

మండపేట: రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు మంగళవారం నుంచి మండపేట పట్టణంలో ఆధార్ అప్‌డేట్ కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. సోమవారం ఆయన చాంబర్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆధార్ అప్‌డేట్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ నెల 22వ తేదీ వరకూ ఈ శిబిరాలు కొనసాగుతాయని, రెండో దశలో 26వ తేదీ నుంచి 29వ తేదీ వరకూ నిర్వహిస్తామన్నారు. తొలిరోజు, మరసటి రోజున వల్లూరివీధిలో ఉన్న 7వ వార్డు సచివాలయంలో ఏర్పాటు చేయగా 21, 22 తేదీల్లో తహసీల్దారు కార్యాలయం సమీపంలో ఉన్న గౌతమి మున్సిపల్ హైస్కూల్లోను ఆధార్ క్యాంపులు పనిచేస్తాయన్నారు. మూడు రోజులు విరామం అనంతరం 26న మళ్లీ ఆధార్ కేంద్రాలు తెరచుకుంటాయన్నారు. 26, 27 తేదీల్లో సత్యశ్రీ రోడ్డులోని ఎస్ఎస్‌వీ మున్సిపల్ హైస్కూల్లో ఏర్పాటు చేయగా, 28, 29 తేదీల్లో రైతుబజార్ సమీపంలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్ శ్రీపటేల్ మున్సిపల్ ప్రైమరీ స్కూల్లో ఈ క్యాంపులు పనిచేస్తాయని వివరించారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆధార్ నవీకరణ చేయించుకోవాలని కమిషనర్ రంగారావు విజ్ఞప్తి చేశారు.

కపిలేశ్వరపురం: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం నుంచి ఆధార్ నవీకరణ ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కె.రత్నకుమారి సోమవారం తెలిపారు. 19, 20 తేదీల్లో కపిలేశ్వరపురం, మాచర, వల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఆధార్ సేవలందిస్తారన్నారు. 21న తాతపూడి, టేకి-2, కాలేరు సచివాలయాల్లోనూ, 26, 27వ తేదీల్లో వెదురుమూడి, వాకతిప్ప నల్లూరు సచివాలయాలు, 28, 29లలో అంగరలోని శ్రీసిద్ధార్థ కళాశాల, కోరుమిల్లి సచివాలయాల్లోనూ ఆధార్ శిబిరాలను నిర్వహించనున్నారు. ఆయా శిబిరాల్లో కపిలేశ్వరపురం, వల్లూరు, టేకి సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు ఇనుమర్తి మల్లేశ్వరరావు, కోరా దొరబాబు, ఫణీంద్ర సేవలందిస్తారని ఎంపీడీఓ తెలిపారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

మండపేట: గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు అందించి వారి ఆరోగ్య సంరక్షణకు కృషి చేయాలని రామచంద్రపురం డివిజన్ వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.ప్రశాంతి అన్నారు. ద్వారపూడిలో ఉన్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని డాక్టర్ ప్రశాంతి సోమవారం సందర్శించారు. గ్రామంలోని పీహెచ్‌సీని పరిశీలించారు. అవుట్ పేషెంట్, ఇన్‌పేషెంట్ల విభాగాల పనితీరును ఆరా తీశారు. ఆసుపత్రిలోని రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. త్వరలో క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్స్ కమిటీ పీహెచ్‌సీకి రాబోతోందని ఆమె తెలి పారు. అదేవిధంగా పీహెచ్‌సీలో సాధారణ కాన్పులు అయ్యేలా క్షేత్రస్థాయి సిబ్బంది గర్భిణులను ప్రోత్సహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ పి.జగదీప్, డాక్టర్ ఎం.అనూష, జిల్లా క్వాలిటీ కన్సల్టెంట్ సునీత, రామచంద్రపురం డివిజనల్ సూపర్‌వైజర్ జి.కమలేశు, పీహెచ్‌సీ హెచ్‌వో ఓ రత్నకుమారి, సూపర్‌వైజర్ టీ మోహనరావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లపై ధాన్యం.. ప్రమాదకరం

- రహదారులపై ధాన్యం ఆరబోత ప్రయాణికుల గమ్యానికి ఆటంకం
- గతంలో అనేక ప్రమాదాలు
- చర్యలు తప్పవంటున్న అధికారులు



వెదురుమూడిలో కంకర రేగి ఉన్న రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం

కపిలేశ్వరపురం: అనుకున్న గమ్యానికి చేరుకునేందుకు రహదారి ప్రయాణం అత్యవసరం. సురక్షిత ప్రయాణానికి ఆటంకాలు కలిగితే ప్రాణహాని జరిగి జీవితమే ముగిసిపోయే ముప్పు వాటిల్లుతుంది. రహదారి నిర్వహణకు సంబంధించిన నియమ నిబంధనలను ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలి. ఈ నిబంధనలు పట్టించుకోకుండా రైతులు రోడ్లపై ధాన్యాన్ని ఆరబెట్టడంతో ప్రయాణికులు ప్రమాద బారిన పడుతున్నారు.

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లోని గ్రామాల్లో రైతులు తాము పండించిన ఖరీఫ్ ధాన్యాన్ని రహదారులపై ఆరబోస్తున్నారు. ఖాళీ ప్రదేశాల్లో ఆరబెట్టే ప్రత్యామ్నాయాలను విస్మరించి ప్రయాణాలు రద్దీగా సాగే రహదారులపై ఆరబోయడం నిబంధనలకు విరుద్ధం, అది ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగిస్తుంది. మానవత్వంతో రైతులు ఆలోచన చేసి రహదారులపై ధాన్యాన్ని ఆరబెట్టకుండా సహకరించాల్సిన ఆవశ్యకతపై ఈ కథనం..

రహదారులపై ధాన్యం నిల్వలు

మండపేట- కపిలేశ్వరపురం, వల్లూరు-టేకి, కోరుమిల్లి-టేకి, మండపేట-ఏడిద, మాచవరం- రాయవరం, కోటిపల్లి-కె.గంగవరం, పామర్రు-అంగర తదితర ప్రధాన రహదారులపై రైతులు ధాన్యంను ఆరబెడుతున్నారు. ధాన్యం ఆరుదల అనివార్యమైన నేపథ్యంలో రైతులు ధాన్యాన్ని రహదారులపై ఆరబెట్టి రాత్రివేళ్ల రాశులుగా వేసి బరకాలతో కప్పి ఉంచుతున్నారు. దీంతో ఆదమరచిన వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

నిండు ప్రాణాలను హరిస్తున్న నిర్లక్ష్యం

మండపేట మండలంలోని తాపేశ్వరం మలుపు, కపిలేశ్వరపురం మండలంలోని గోదావరి గట్టు, వెదురుమూడి గజ్జిరపువారి చావిడి తదితర మలుపులు మృత్యుకుహరాలని గత ప్రమాదాల తీరు తేటతెల్లం చేస్తోంది. కపిలేశ్వరపురం-అంగర, వెదురుమూడి-మండపేట, వల్లూరు-టేకి, కోరుమిల్లి-మాచర, టేకి- కె.గంగవరం తదితర రహదారులపై ఖరీఫ్ ధాన్యాన్ని ఆరబెట్టడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ధాన్యం రాశులను తప్పించే ప్రయత్నాలతో వాహనాలు నిబంధనలు విరుద్ధంగా సాగిపోతున్నాయి. అకస్మాత్తుగా మలుపులు తిప్పేస్తుండడంతో వెనుక ఉన్న ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. ఒక వైపు ధాన్యం రాశులు వేస్తుండడంతో మిగిలిన మార్గంలోనే ఎదురెదురు వాహనాలు రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఇరుకు ప్రయాణాలతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. 2023 నవంబర్‌లో ఆరబోసిన ధాన్యం రాశిని తప్పుకునే వెళ్లే సందర్భంగా రెండు మోటారు బైకులు ఢీకొని అంగర, పడమర ఖండ్రిక గ్రామాలకు చెందిన యువకులు గాయాలపాలయ్యారు. 2017 నవంబర్ 10న అంగరకు చెందిన మహిళ ధాన్యం రాశులు ఉన్న రహదారిపై ఆటోలో వెళ్తున్న కాసూరి వీరరాఘవ(బూరమ్మ) వెదురుమూడి గ్రామ శివారు కముజుల కొంపలు వద్ద ఆటోలోంచి జారి పడి మృతి చెందింది. అదే ప్రదేశంలో నవంబర్ 9న రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. అందులో ఓ యువకునికి తీవ్ర గాయాలయ్యాయి. ఇవి మాత్రమే కాకుండా తరచూ నమోదుకాని ప్రమాదాలెన్నో జరుగుతున్నాయి.

గుంతల రహదారులతో..

రెండు నియోజకవర్గాల్లోని రహదారులు గుంతలు మయమయ్యాయి. వెదురుమూడి - మండపేట మీదుగా మండపేట, కపిలేశ్వరపురం, కె.గంగవరం మండలాల ప్రజలు ప్రయాణాలు సాగిస్తారు. ప్రైవేటు, ప్రభుత్వ వాహనాలు, వ్యాపార, వ్యవసాయ ఉత్పత్తులను తరలించే భారీ వాహనాలు నిత్యం రాకపోకలతో రద్దీగా ఉంటుంది. రహదారి గుంతలతో దర్శనమిస్తోంది. కపిలేశ్వరపురం- అంగర, వెదురుమూడి-సంధిపూడి రహదారులు సైతం అధ్వానంగా ఉన్నాయి. గుంతలు ఉన్న రహదారులపై ధాన్యాన్ని ఆరబోయడంతో ప్రమాద అవకాశాలు మరింత తీవ్రంగా ఉన్నాయి.

రహదారులపై ధాన్యం ఆరబోస్తే చర్యలు



"రహదారులపై ధాన్యాన్ని ఆరబెట్టినా, రాశులుగా వేసిన ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. రైతులు ఈ విషయాన్ని గమనించి రహదారులపై రాకపోకలకు ఆటంకాలు లేకుండా సహకరించారు. విలువైన ప్రాణాలను కాపాడుకునే బాధ్యతతో వ్యవహరించాలి. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినవారిపై చట్ట పరిధిలో చర్యలు తప్పవు."

– డి.రవికుమార్, ఎస్ఐ, అంగర

నిబంధనలు పట్టని వాహనచోదకులు

రహదారులపై ప్రయాణిస్తున్నప్పుడు రహదారి నిబంధనలను పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గతంలో జరిగిన ప్రమాద ప్రదేశాల్లోనూ, ప్రమాదకర మలుపులు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ ద్విచక్ర వాహనదారులు వేగ నియంత్రణ లేకుండా వాహనాలను నడుపుతున్నారని రహదారి చెంత నివాసితులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అవసరమైన చోట ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్‌లను గుర్తించి ప్రత్యేక ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని, వంద మీటర్లు దూరం నుంచే కనిపించేంత పరిమాణంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలంటూ ఉన్నతాధికారులు చేసిన నిర్ణయాలు క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం వల్ల కూడా ప్రమాదాలు సంభవిస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్డీఓకు 3 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీఓ

రామచంద్రపురం: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ దేవరకొండ అఖిల ఆధ్వర్యంలో నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్‌లో 3 అర్జీలు అందాయి. ఆక్రమణ తొలగించాలని ఒకటి, పందులను నిర్మూలించాలని ఒకటి, రక్షణ కల్పించాలని ఒకటి అర్జీలు వచ్చినట్లు ఆర్డీఓ అఖిల తెలిపారు.

వార్డుల్లో దోమల మందు పిచికారీ



రామచంద్రపురంలో దోమల మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

సాక్షి ఇంపాక్ట్

రామచంద్రపురం: దోమలు బాబోయ్ దోమలు శీర్షికన సోమవారం ప్రచురితమైన 'సాక్షి' కథనానికి రామచంద్రపురం మున్సిపల్ అధికారులు స్పందించారు. సోమవారం పట్టణంలోని వార్డుల్లో దోమల మందు పిచికారీ చేయించారు. దీంతో పట్టణ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

వైఎస్సార్ సీపీ ఆర్థిక సాయం



శలపాకలో బాధిత కుటుంబీకులకు ఆర్థిక సహకారం అందజేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ పిల్లి సూర్యప్రకాశ్ తదితరులు

కాజులూరు: మండలంలోని శలపాకలో గత 15 రోజుల క్రితం దారుణ హత్యలకు గురైన బాధిత కుటుంబీకులను సోమవారం రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ పిల్లి సూర్యప్రకాశ్ తదితరులు మరోమారు పరామర్శించారు. 12 రోజుల క్రితం మొదటిసారిగా హత్యకు గురైన బత్తుల చిన్నయ్య, బత్తుల రాజు, బత్తుల రమేష్‌ల భార్య పిల్లలను సూర్యప్రకాశ్ తదితర నాయకులు పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు మాట్లాడుతూ కూలి పనులతో కుటుంబాలను పోషించే కుటుంబ పెద్దలు అన్యాయంగా హత్యలకు గురికావటంతో మృతుల కుటుంబ సభ్యులు జీవనాధారం లేక అలమటిస్తున్నారని నాయకులు తగిన రీతిలో ఆదుకోవాలన్నారు. దీనిపై సూర్యప్రకాశ్ స్పందిస్తూ త్వరలో పార్టీ తరపున ఆర్థిక సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో సోమవారం సూర్యప్రకాశ్ తదితరులు మృతుల కుటుంబ సభ్యులను కలుసుకుని వారికి కార్యకర్తల తరపున రూ.45,000 నగదు రూపంలో సహకారం అందజేశారు. మృతుల కుటుంబాల్లో ఒక్కొక్క మహిళ చొప్పున ముగ్గురికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని కూటమి నేతలు ప్రకటించారని త్వరలో వాటిని అమలు చేయాలని సూర్యప్రకాశ్ డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు వైఎస్సార్ సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఎంపీపీ మాత భారతి, రామచంద్రపురం మాజీ జెడ్పీటీసీ ఇంత సంతోషం, గొల్లపాలెం పీఏసీఎస్ మాజీ చైర్మన్ సత్తి శ్రీరామారెడ్డి, పోతు శ్రీనివాసు, మాత నూకరావు పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో పేపర్ క్రాఫ్ట్ పోటీలు

రామచంద్రపురం: పట్టణంలోని గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకుని సోమవారం గ్రంథాలయ అధికారి దడాల రమణ ఆధ్వర్యంలో విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ హైస్కూల్ ఉపాధ్యాయుడు జి.ఈశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు గ్రంథాలయాల ఉపయోగాలు, వాటిని వినియోగించుకునే విధానాలపై వివరించారు. అనంతరం విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. ఎం.రాజేంద్ర, ఎం.వెంకట్, సీహెచ్ అనిల్ కుమార్, ఎం.రవిచంద్ర, కె.నిర్మల, లైబ్రేరియన్ ఎస్.వనజాక్షి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

రామచంద్రపురం రూరల్‌లో..

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం గ్రంథాలయ అధికారి ములంపాక వీర సూరిబాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా క్రాఫ్ట్ ఉపాధ్యాయుడు కేవీ రమేష్, గణిత ఉపాధ్యాయుడు బీవీ సురేంద్ర పర్యవేక్షించారు. పోటీలో గెలుపొందిన వారికి ఈ నెల 20 న బహుమతి ప్రదానం ఉంటుందని లైబ్రేరియన్ సూరిబాబు తెలిపారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

మండపేట: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని మండపేట గ్రంథాలయ శాఖ అధికారి ఎస్.పూర్ణమ్మ ఆధ్వర్యంలో ఘనంగా జరుగుతున్నాయి. సోమవారి నాటికి ఈ వారోత్సవాలు 5 రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఏడిద రోడ్డులోని వేగుళ్ల సూర్యారావు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. 6వ తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులు 90 మంది పాల్గొన్నారు. ఇందులో జూనియర్, సీనియర్లుగా విభజించి పోటీలు పెట్టామని పూర్ణమ్మ తెలిపారు. అనంతరం విద్యార్థులచే గ్రంథాలయ వారోత్సవాల ప్రతిజ్ఞ చేయించారు.



ద్రాక్షారామ గ్రంథాలయంలో తయారు చేసిన పేపర్ క్రాఫ్ట్స్‌తో చిన్నారులు



రామచంద్రపురం గ్రంథాలయంలో పాటలు పాడుతున్న విద్యార్థిని



క్విజ్ పోటీల్లో పాల్గొన్న ఎస్‌వీఎస్సార్ విద్యార్థులు



కపిలేశ్వరపురం గ్రంథాలయంలో జనరల్ నాలెడ్జ్ పోటీల్లో విద్యార్థులు

విద్యార్థులకు విజ్ఞాన ప్రతిభా పోటీ

కపిలేశ్వరపురం: గ్రామ గ్రంథాలయంలో విద్యార్థులకు విజ్ఞాన ప్రతిభా పోటీని నిర్వహించారు. గ్రంథాలయాధికారి దానేటి శివకుమారి ఆధ్వర్యంలో జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో జనరల్ నాలెడ్జ్ పోటీలను నిర్వహించగా గ్రామంలోని సుమారు 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు ఈ నెల 20న వారోత్సవాల ముగింపు సందర్భంగా బహుమతులను అందజేయనున్నట్టు గ్రంథాలయాధికారి తెలిపారు.

శంభో మహాదేవ..

- ఘనంగా మూడో సోమవారం
- కిక్కిరిసిన ద్రాక్షారామ భీమేశ్వరాలయం
- ప్రత్యేక పూజలు చేసిన భక్తులు



కోటిపల్లిలో సోమేశ్వర స్వామికి అభిషేకాలు చేస్తున్న పండితులు



యండగండి శివాలయంలో స్వామికి అభిషేకం చేస్తున్న పండితులు



ద్రాక్షారామ భీమేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు



ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శివలింగం వద్ద దీపాలు వెలిగించి నమస్కరిస్తున్న భక్తులు



గొల్లపాలెం శివాలయంలో స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామ క్షేత్రంలో వేంచేసిన మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయానికి మూడవ కార్తిక సోమవారం పురస్కరించుకుని భక్తులు వేలాదిగా తరలి రావడంతో ఆలయం కిక్కిరిసింది. తెల్లవారుజాము నుంచే ఆలయానికి అధిక సంఖ్యలో చేరుకుని ఆలయ ప్రాంగణంలోని సప్తగోదావరి నదిలో స్నానమాచరించి భీమేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించుకున్నారు. మాణిక్యాంబా అమ్మవారి సన్నిధిలో భక్తులు కుంకుమ పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్థలాల్లో కార్తిక నోములకు సంబంధించిన ప్రత్యేక పూజలు రుత్వికులతో నిర్వహించారు. ధ్వజస్తంభం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రదేశాలలో ఆవు నేయి వత్తులను వినియోగించి పుణ్య స్త్రీలు దీపారాధన నిర్వహించడం ద్వారా కార్తిక మాస విశిష్టతను, వ్రత మహత్యాలను తెలుసుకున్నారు. ఆలయ ఈఓ, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కోటిపల్లిలో..

కె.గంగవరం: కార్తిక మాసం రెండో సోమవారం సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో సందడి నెలకొంది. ముఖ్యంగ కోటిపల్లి, పామర్రు, కె.గంగవరం, యర్రపోతవరం, భట్లపాలిక తదితర గ్రామాల్లోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. ఆయా గ్రామాల్లో శివాలయాల వద్ద గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు స్వామికి పలు అభిషేకాలు నిర్వహించారు. కోటిపల్లిలో కొలువైన ఛాయా సోమేశ్వర స్వామి ఆలయం వద్ద పలు గ్రామాలకు చెందిన భక్తులు పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తెల్లవారుజామునే గోదావరిలో పుణ్యస్నానం ఆచరించి సోమేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ భీమశంకరం పూజలకు కావాల్సిన ఏర్పాట్లు చేశారు. దేవదాయ ధర్మదాయ రామచంద్రపురం తనిఖీదారు ఆర్.బాలాజీ రాంప్రసాద్ దంపతులు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు తోట పృథ్వీ స్వామిని దర్శించుకున్నారు. దంగేరు, తామరపల్లి, సత్యవాడ, కోటిపల్లి గ్రామానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కాజులూరులో..

కాజులూరు: మండలంలోని శివాలయాల్లో సోమవారం భక్తులతో సందడి నెలకొంది. కార్తిక సోమవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చి హరహర మహాదేవ శంభోశంకరా... ఓం నమశ్శివాయ... అంటూ శివనామ స్మరణతో శివాలయాల్లో ప్రదక్షిణలు చేశారు. తెల్లవారుజాము నుంచే స్వామికి అభిషేకాలు చేయించుకునే భక్తులతో శివాలయాలు కిటకిటలాడాయి. మండలంలోని గొల్లపాలెం, కాజులూరు, శీల, దుగ్గుదుర్రు, కుయ్యేరు, అయితపూడి, పెనుమళ్ల, అంద్రంగి, పల్లిపాలెం, ఉప్పుమిల్లి, కోలంక, జగన్నాథగిరి గ్రామాల్లోని శివాలయాల్లో తెల్లవారుజామున మూడు గంటల నుంచే అభిషేకాలు ప్రారంభమయ్యాయి. ఆయా గ్రామాల్లోని పిల్లలు, పెద్దలు, మహిళలు శివాలయాలకు వెళ్లి స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన చేయించి, స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

భస్మలేపనుడికి భక్తుల బ్రహ్మరథం

- శివనామస్మరణతో మార్మోగిన శివాలయాలు
- సోమేశ్వరంలో జ్యోతిర్లింగార్చన

రాయవరం: భక్త సులభుడు..భస్మలేపనుడు..నీలకంఠుడుగా భక్తుల నీరాజనాలందుకునే కైలాసవాసుడికి భక్తజనం ప్రణమిల్లారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా ఓం నమఃశివాయ, హరహర మహాదేవ శంభోశంకర..అనే నినాదాలతో ఆలయాలు శివనామస్మరణ మార్మోగింది. కార్తిక మాసం మూడో సోమవారం వేకువజాము మూడు గంటల నుంచే భక్తులతో పోటెత్తాయి. చారిత్రక శివాలయాలైన సోమేశ్వరం బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి, వెంటూరు ఉమా సోమేశ్వరస్వామి, రాయవరం పార్వతీ సమేత రాజరాజేశ్వరస్వామి, చెల్లూరు బాలాత్రిపుర సుందరీ సమేత అగస్త్యేశ్వరస్వామి తదితర శివాలయాల్లో భక్తులు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేకువజామున భక్తులతో ప్రారంభమైన క్యూలైన్లు ఉదయం 11గంటల వరకు కొనసాగాయి. ఉదయం నుంచి ఉపవాసదీక్షను చేపట్టిన పలువురు మహిళాలు స్వయంపాకంతో పాటు కొందరు దీపాలను దానం చేశారు. ఆలయాల్లో భక్తులు కార్తిక దీపాలతో దీపశోభను సంతరించుకున్నాయి.

సోమేశ్వరాలయంలో జ్యోతిర్లింగార్చన

మండలంలోని బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరాలయంలో సాయంత్రం ఆరు గంటలకు జ్యోతిర్లింగార్చన నిర్వహించారు. కర్రి ఆదినారాయణరెడ్డి, నాగలక్ష్మి దంపతులు సౌజన్యంతో కార్యక్రమం నిర్వహించారు. ప్రమిదలను లింగాకారంలో అమర్చి వాటిని వెలిగించి జ్యోతిర్లింగార్చన చేశారు.

సంగమేశ్వరునికి అన్నాభిషేకం

మండపేట: ఏడిద సంగమేశ్వరస్వామి వారి ప్రసిద్ధ పుణ్యక్షేత్రంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్సీ తోట కుటుంబ సమేతంగా స్వామివారికి పూజలు, చేసి, అన్నాభిషేకం నిర్వహించారు.



సోమేశ్వరంలో స్వామికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ



సంగమేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కుటుంబ సభ్యులు



రాయవరంలో దీపాలను వెలిగిస్తున్న భక్తులు